1

నవతెలంగాణ ఆదిలాబాద్

సోమవారం | అక్టోబర్ 09, 2023 | www.navatelangana.com

వీర జవాన్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన రాథోడ్ అనిల్ అగ్నిపత్‌లో ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. ట్రైనింగ్ ముగించుకొని ఇంటికి వచ్చిన సందర్భంగా గ్రామ శ్రీసంత్ సేవాసమితి, క్రాంతి యూత్ సభ్యులు ఆదివారం గ్రామంలో భారీర్యాలీతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆర్మీ జవాన్‌కు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ జాదవ్ సునీత మాట్లాడుతూ గ్రామంలో ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం పొందిన అనిల్‌ను ఆదర్శంగా తీసుకొని యువకులు ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అజ్జు, శ్రీ సంత్ సేవా సమితి అధ్యక్షులు సందీప్ రాథోడ్, సభ్యులు సుభాష్, రాథోడ్ జితేందర్, గ్రామ పెద్దలు ప్రజలు క్రాంతియూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొలువులు రావటం మా ఊరికే గర్వకారణం

నవతెలంగాణ-లక్ష్మణచాంద



ప్రభుత్వ కొలువులు రావటం మా ఊరికేంతో గర్వకారణామని ఆదివారం మాజీ అసెంబ్లీ డిప్యూటి స్పీకర్ తనయులు, నాయకులు అయిండ్ల భూపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని మునిపెల్లి గ్రామంలో కానిస్టేబుల్ ఉద్యోగం సాదించిన షేరు ప్రవీణ్ రెడ్డి, కొయ్యల హరీష్ రెడ్డిలను, ఆర్మీలో ఉద్యోగం సాదించిన కమల్‌కోట ప్రణవ్, ప్రసాద్ రెడ్డిని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమల్‌కోట పద్మ వెంకట్ రెడ్డి, మా జీ పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కొండాపూర్ నర్సారెడ్డి, నాయకులు షేరు రాజారెడ్డి, చిన్న రాజా రెడ్డి, అయిండ్ల భీంరెడ్డి, ధామోధర్ రెడ్డి, కమలకోట లింగారెడ్డి, గ్రామ యువుకులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడిని ఆదుకున్న దాతలు



నగదు, నిత్యావసర సరుకుల ను అందిస్తున్న దాతలు

నవతెలంగాణ-ఉట్నూర్

రెండు నెలల కింద నాగాపూర్ రోడ్ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడ్డ బాధితునికి దాతలు అండగా నిలిచారు. ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు. దాతల ద్వారా వచ్చిన రూపాయలు, ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా దాత ప్రజ్ఞశీల్ మాట్లాడుతూ మండలంలోని గొట్టిపటార్‌కు చెందిన గిల్చే నితిన్ గత రెండు నెలల కింద రోడ్డు ప్రమాదంలో ఆయనకు తీవ్రమైన గాయాలయ్యాయని, నిరుపేద కుటుంబం కావడంతో ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించడానికి డబ్బులు లేకపోవడంతో ఎలాగైనా స్నేహితునికి వైద్యం అందించాలని దాతల ద్వారా నిధులు సేకరించి వైద్యం అందించడం జరిగిందన్నారు. మిగిలిన రూ.11,570తో ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటుగా, వైద్య పరీక్షల కోసం రూ.60వేలను కుటుంబ సభ్యులకు అందించినట్టు ప్రజ్ఞశీల్ తెలిపారు. గాయాలపాలైన నిరుపేద గిల్చే నితిన్ దాతలు సాకాలంలో అదుకున్నందుకు అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిత స్నేహితులు, దాతలు ఉన్నారు.

సవరి బంగ్లా షెడ్యూల్ ప్రారంభించిన జెడ్పీటీసీ



సవారీ బంగ్లా షెడ్డును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని చిన్న మందగూడ గ్రామంలో జెడ్పీ నిధులు 4లక్షలతో సవారీ బంగ్లా షెడ్డును జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగు భాయ్, ఉప సర్పంచ్ దేవరావు, ఎంపీటీసీలు హనుమంతు, వెంకన్న యాదవ్, కోఆప్షన్ సభ్యులు బాబుఖాన్, సర్పంచులు సుభాష్ గంగారం, గ్రామ పటేల్ శ్రీనివాస్, నాయకులు కొరెంగ శ్రీనివాస్, జైతు పటేల్, దత్తు పటేల్, మాజీ ఎంపీటీసీ దాదారావు పాల్గొన్నారు

బోరిగాంలో పత్తి పంట క్షేత్ర ప్రదర్శన



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని బోరిగాం శివారులో రైతు పోతన్న వ్యవసాయ చెనులో సాగు చేసిన రాయల్ సీడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాణధీర్ బీజీ-2 పత్తి పంటను ఆదివారం రైతులు సందర్శించారు. వ్యవసాయ క్షేతంలో సాగు చేసిన పత్తి పంటను పరీశీలించారు. పలు వివరాలను కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. ఆనంతరం రైతులను కంపెనీ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్, రిజీనల్ మేనేజర్ యాకూబ్ ఆలీ, ఏరియా మేనేజర్ కిషన్ , రైతులు పాల్గొన్నారు.

మండలంలో బతుకమ్మ చీరల పంపిణీ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని పిప్రి గ్రామంలో ఆదివారం మహిళలకు గ్రామ సర్పంచ్ సిర్నపల్లి ముత్తవ్వ సాయన్న, హద్దాం గ్రామంలో సర్పంచ్ సరస్వతి బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండగ ఆడపడుచుల పండగని, మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఓ కానుక ఈ చీరల పంపిణీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాదుకా దర్శనం



నవతెలంగాణ-ముధోల్

అనంత శ్రీవిభూషిత్ జగద్గురు రామనందచార్య, శ్రీ నరేంద్రాచార్య జి మహరాజ్ (మహారాష్ట్ర) పాదుకా దర్శన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన వీధుల గుండా ప్రత్యేక రథంలో స్వామీజీ పాదుకాలతో శోభాయాత్రను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ముధోల్ నియోజకవర్గం నుండి కాకుండా నిజామాబాద్, మహారాష్ట్ర, జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పాదుకాలను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, బీజేపీ నాయకులు రామారావు పటేల్, మోహన్ రావు పటేల్‌తోపాటు స్థానిక నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-కడెం



ఖానాపూర్‌టౌన్: దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్మికులు

తెలంగాణలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.2వేలు వేతనం పెంచిన జీఓను వెంటనే అమలు చేయాలని అన్నారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఎంఈఓ కార్యాలయం ముందు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 13 రోజుల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఈనెల 10న ఛలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాల్సిందిగా కార్మికులకు పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికుల గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు కోడిగుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం యూనియన్ జిల్లా కార్యదర్శి రాధ, కడెం మండలం అధ్యక్షులు లత, మండల కార్యదర్శి వెంకవ్వ, కోశాధికారి విజయ, దస్తురాబాద్ మండల అధ్యక్షులు శంకరవ్వ కార్యదర్శి లింగవ్వ, కోశాధికారి లావణ్య పాల్గొన్నారు.



కడెం: సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఖానాపూర్‌టౌన్ : నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. ఖానాపూర్‌లో మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం ఆరు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా భోజన పథకం కార్మికులకు రూ.2వేల వేతనాన్ని ఇవ్వాలని అన్నారు. పిల్లలకు ఇచ్చే మెనూ చార్జీలను పెంచాలన్నారు. వంటకానికి అవసరమైన గ్యాస్ ను ప్రభుత్వమే సరాఫరా చేయాలన్నారు. కార్మికులకు డ్రెస్ కోడ్, వంట పాత్రలు మౌళిక వసతులు, ప్రమాదబీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 10న జరుగనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యహ్న భోజన కార్మిక నాయకులు బెజ్జారపు లక్ష్మీ, విమల, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కేంద్రం తెచ్చిన నూతన అటవీ చట్టాన్ని ఉపసంహరించాలి

- తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు కోవ సునీల్

నవతెలంగాణ-ఉట్నూర్

కేంద్రం ప్రభుత్వం తెచ్చిన నూతన అటవీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకొని, జీఓ నెంబర్ 3ని వెంటనే పునరుద్ధరించాలని, తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఉట్నూర్ డివిజన్ అధ్యక్షులు కోవ సునీల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా 10న పర్యటించనున్న నేపథ్యంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం స్థానిక బాలుర వసతి గృహంలో నిరసన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఆదివాసులకు ఉద్యోగాలు కల్పించే జీఓ నెంబర్ 3ని రద్దు చేసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. జీఓ నెంబర్ 3ని రద్దు చేయడం వలన ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసులు ఉద్యోగాలకు దూరమవుతున్నారని, వెంటనే జీఓ నెంబర్ 3ని పునర్ధరించాలని డిమాండ్ చేశారు. నూతన అటవీ చట్టం అమలు అయితే పర్యావరణానికి, ఆదివాసులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గణేష్, మురళి, శ్రీకాంత్, లింగు, గంగారాం ఉన్నారు.



నిరసన తెలుపుతున్నా నాయకులు

ఖానాపూర్ నియోజక వర్గంలో అభివృద్ధి శూన్యం

- పదేండ్ల పాలనలో గిరిజన గ్రామాలు రోడ్లకు నోచుకోని వైనం
- ఖానాపూర్ జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ ధారవత్ నరేందర్ నాయక్



మాట్లాడుతూన్న నాయకులు ఖానాపూర్ జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ ధారవత్ నరేందర్ నాయక్

నవతెలంగాణ-సిరికొండ

ఖానాపూర్ నియోజక వర్గంలో అభివృద్ధి శూన్యమని ఖానాపూర్ జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ ధారవత్ నరేందర్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పదేండ్ల పాలనలో గిరిజన గ్రామాలు రోడ్లకు నోచుకోని పరిస్థితి నెలకొందని అన్నారు. అత్యంత వెనుకబడిన సిరికొండ మండలంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని అన్నారు. మండలం ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు కావస్తున్న ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యాలయాలు సొంత భవనాలకు నోచుకోవడం లేదని అన్నారు. కొత్త మండలాలు ఏర్పాటు చేస్తున్నామని ఆర్భాటాలు చేయడం తప్ప, కనీస సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. మండలంలో అధిక శాతం గిరిజన గ్రామాలే ఉన్నాయని అన్నారు. విద్య, వైద్యం, రోడ్లు సరిగా లేకపోవడంతో గర్భిణులు ఆస్పత్రులకు వెళ్ళే లోపే డెలివరీ అయి ప్రాణాలు పోతున్నాయని అన్నారు. మండలంలో కనీసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడం సిగ్గు చేటని అన్నారు. త్రిఫెజ్ కరెంట్ సౌకర్యం లేక రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. నిర్మల్‌లో జరిగిన సభలో రాష్ట్ర మంత్రి కేటీఆర్ స్వయంగా ఖానాపూర్ నియోజక వర్గంలో అభివృద్ధి జరగలేదని చెప్పడం సిగ్గు చేటని అన్నారు. ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యే ఏ పార్టీ వారని ప్రశ్నించారు. కొత్తగా అభ్యర్థిని ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ, ఇక్కడ అభ్యర్థులే లేనట్టు ఎక్కడి నుండో తీసుకువచ్చి పోటీ చేయిస్తున్నారని అన్నారు. అసలు అతను ఎస్టీయే కాదని అన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. జనసేన పార్టీ అభ్యర్థిత్వం తీసుకొనే వారికి ప్రమాద బీమా కింద రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు శ్రీనాథ్, పండుగ చంద్రశేఖర్, రాజు, పరమేశ్వర్, ప్రశాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రేపు జిల్లాకు కేంద్రమంత్రి అమిత్ షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మాట్లాడుతూన్న ఆదిలాబాద్ ఎంపి సోయం బాపురావు

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలను అరిగోసలు పెడుతున్న కారణంగా, అవినీతి రాజకీయ నాయకుల అంతం కోసం ఆదిలాబాద్ పట్టణంలో ఈనెల10న జనగర్జన భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశామని, సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొన్నట్లు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్ తెలిపారు. ఆదివారం సభ స్థలి డైట్ మైదానంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంతకు ముందు డైట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభ ఏర్పాట్లను మాజీ కేంద్ర సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాంతో కలిసి పరిశీలించారు. ప్రజా వ్యతిరేక విధానాన్ని తరిమికొట్టెందుకు బీజేపీ చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా ఈనెల 10న జనగర్జన సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్రమంత్రి అమిత్ షా జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లాలో ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న పనుల గురించి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. మూతబడిన్న సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని పున్హ ప్రారంభించాలని కోరుతామన్నారు. ట్రైబల్ యూనివర్సిటీ, ఆదిలాబాద్‌లో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ తదితర వాటి గురించి కేంద్ర మంత్రి స్పష్టంగా తెలియజేస్తారన్నారు. జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను అరికట్టడానికి బీజేపీ కంకణం కట్టుకుందన్నారు. మంగళవారం జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు అల్లాపూర్ శ్రీనివాస్, బద్దం లింగారెడ్డి, ఎగ్రాల నగేష్, సుహాసిని రెడ్డి, బోయర్ విజయ్, ఆకుల ప్రవీణ్, లోకా ప్రవీణ్ రెడ్డి, జోగు రవి, వేద వ్యాస్, ఆదినాథ్, రాందాస్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో వెనుకబడ్డ ఖానాపూర్ నియోజకవర్గం

- నిధులు కేటాయించాలని ఎల్‌హెచ్‌పీఎస్ డిమాండ్



మాట్లాడుతూన్న ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు

నవతెలంగాణ-ఖానాపూర్

అభివృద్ధిలో వెనుకబడ్డ ఖానాపూర్ నియోజకవర్గానికి నిధులు కేటాయించాలని లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు బాణవత్ గోవింద్ నాయక్, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాసమళ్ళ అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 4న నిర్మల్ సభలో మంత్రి కేటీఆర్ ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడ్డదని ఒప్పుకున్నారని తెలిపారు. ఎస్టీ నియోజకవర్గం కావడంవల్ల నిధులను పక్క నియోజకవర్గాలకు తరలించిన ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. నిధులను కేటాయించకుండా అభివృద్ధి ఎలా జరుగుతుందో కేటీఆర్ తెలుపాలన్నారు. డిగ్రీ కళాశాల, రోడ్లు, మున్సిపల్ నిధులు కేటాయించకుండా మౌళిక సాదుయలు కల్పించడం లేదన్నారు. తొమ్మిదేండ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించక అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించని నాయకులని ప్రజలు నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఖానాపూర్ పట్టణ అధ్యక్షులు షౌకత్ పాషా, షేక్ యునుష్ పాల్గొన్నారు.

బీఎస్పీ మండలాధ్యక్షుడిగా ముప్పిడి వేణు



నవతెలంగాణ-దస్తురాబాద్

ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బన్సీలాల్ రాథోడ్ ఆధ్వర్యంలో ఆదివారం బీఎస్పీ మండల అధ్యక్షుడిగా ముప్పిడి వేణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని, రాబోయే ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని అన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని అన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-తలమడుగు

బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర, నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు.ఉండం, సుంకిడి, కొత్తూర్, కుచలాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన సమక్షంలో 250 మంది వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరారు. గ్రామస్తులు డప్పు చప్పుల మధ్య హారతులతో స్వాగతం పలికారు. గెలిపించిన తర్వాత సీఎం సహకారంతో ఆదర్శంగా గ్రామాలను తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డిభోజారెడ్డి, మాజీ విజయ డెయిరీ చైర్మెన్ లోక భూమా రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పిడుగు సంజీవరెడ్డి, వసంత్ రెడ్డి, తోట వెంకటేష్, కిరణ్ కుమార్, కేదారేశ్వర్ రెడ్డి, కంది పోచ్చుబాయ్, నరసింహులు, మహేందర్ యాదవ్, రేవతి పోచ్చన్న, ప్రభదేవరావు, కళ్లెం కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీపీ, సర్పంచ్



నవతెలంగాణ -లోకేశ్వరం

మండలంలోని గచ్చుందా గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ సాయన్న, మాజీ సర్పంచ్ గంగన్న ఆదివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి సమక్షంలో చేరారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి గులాబీ కండువ వెసుకున్నారు. క్షేతస్థాయిలో ప్రభుత్వ పథకాలు పేదలకు అందేల కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మెన్ లోలం శ్యామ్ సుందర్, ఎంపీపీ లలిత భోజన్న , పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్, పార్టీ మండల కన్వీనర్ కరిపే శ్యామ్ సుందర్, సర్పంచులు వెంకట్‌రావ్, భుజంగ్‌రావు పటేల్, దార్వాడి కపిల్, బీమ్‌రావ్ పటేల్, మాజీ ఎంపీపీ సాగర్, మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి సుధాకర్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

నవతెలంగాణ-కడెం



తెలంగాణ రాష్ట్రంలో ఆడపడుచులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మహిళలకు అండగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తోందని సర్పంచ్ కొప్పుల లక్ష్మి లచ్చన్న అన్నారు. ఆదివారం మండలంలోని అంబారిపేట్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న బతుకమ్మ చీరలను సర్పంచ్ మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సదువుల రాజేష్, ఐకేపీ సీసీ స్వామి, రేషన్ డీలర్ ప్రసాద్, విఓఏ కవిత, బీఆర్ఎస్ నాయకులు పాక భూమన్న, వేల్పుగొండ లింగన్న గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని ఎర్రగుంట గ్రామంలో గుడుంబా స్థావరాలపై ఆదివారం ఎస్సై ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గుడుంబా తయారీకి నిలువచేసిన 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అనంతరం ఎస్సై ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గుడుంబా తయారు చేసిన వారిపై, దానికి సహకరించిన, అమ్మడానికి ప్రయత్నం చేసిన పీడీయాక్ట్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. గుడుంబా తయారు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దైవాకర్, లక్ష్మణ్, షఫీ, రవిలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తల వంటావార్పు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్ల గురించి ప్రభుత్వం స్పందించి, చర్చలు జరపాలని ఆశా యూనియన్ కార్యదర్శి సుజాత అన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగగా ఆదివారం 14వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా అక్కడ వంట వార్పు నిర్వహించి, అక్కడే తిని తమ నిరసన వ్యక్తం చేశారు. తమకు నిర్ణిత వేతనం రూ.18వేలు నిర్ణయించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆశాల మీద మొండి వైఖరిని విడనాడలన్నారు. ప్రభుత్వం స్పందించి సమ్మె విరమణకు చొరవ చూపాలన్నారు. లేనిపక్షంలో సమ్మె మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన ఆదివాసులు



నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని పరస్వాడ గ్రామపంచాయితీ పరిధిలోని దర్మగూడలో పెర్సపెన్ షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆత్రం సక్కు రూ.4 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివాసీ నాయకులు మర్సుకొల పరివారం తరుపున ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు. నిధులను విడుదల చేయడం పట్ల ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇందులో మర్సుకొల న్యానేశ్వర్ ఉన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు సన్మానం

నవతెలంగాణ-తాంసి

కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన అభ్యర్థులకు ఆదివారం ఆయా గ్రామాల సర్పంచ్, గ్రామస్తులు శాలువాతో సన్మానించారు భీంపూర్ మండలానికి చెందిన నలుగురు తాంసి మండలానికి చెందిన అభ్యర్థులు ఐదుగురు ఉన్నారు తాంసి మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్‌తో పాటు స్నేహితులు ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ యువత చదువులో ఆసక్తి ఉండి కష్టపడితే ఉద్యోగం సాధించడం కష్టం కాదని అన్నారు. తల్లీ దండ్రులు కష్టపడి చదివిస్తే వారు కన్నా కలలు ఉద్యోగం సాధించి వారి కండ్లలో ఆనందం చూడటమే అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న, సదానందం, వెంకన్న, నరేందర్ యాదవ్ ఉన్నారు.

గుడుంబా తయారీ, విక్రయించిన కఠిన చర్యలు

నవతెలంగాణ-కడెం

మండలంలోని పెద్దూర్ తండా గ్రామంలో ఆదివారం గుడుంబా స్థావరాలపై కడెం పోలీస్‌ల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామంలోని నాగవత్ రమేష్ ఇంటి వద్ద 500 లీటర్ల బెల్లం పానకం గుర్తించి, దానిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కోసన రాజు మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరు గుడుంబా తయారు చేయవద్దని, విక్రయించకూడదని అన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యూనివర్సిటీలో పండ్ల మొక్కల పెంపకానికి ప్రాధాన్యత



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో పండ్ల మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ అన్నారు. ఆదివారం వీసీ వెంకటరమణ ఆదేశాల మేరకు డైరెక్టర్ సతీష్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎస్బీఐ బ్యాంక్ సిబ్బంది సుమారు నాలుగు వేల పండ్ల మొక్కలను విద్యార్థులతో కలిసి నాటారు. యూనివర్సిటీ పరిసరాలు పచ్చదనంతో కళకళలాడే విధంగా ఉండేందుకు గాను మొక్కలను పెంచేందుకు విద్యార్థులను భాగస్వామ్యం చేసే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

10వ రోజు గాంధీ మార్గంలో ఆపరేటర్ల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో పనిచేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లు సమ్మెబాట పట్టారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు జూనియర్ అసిస్టెంట్‌లకు పేస్కెల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సమ్మెకు దిగారు. కాగా ఆదివారంతో ఈ సమ్మె 10వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా గాంధీ సూచించిన సందేశంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు అందరూ కండ్లు, చెవులు, మూతి మూసుకొని గాంధీ మార్గంలో నిరసన తెలిపారు. ఉద్యోగులందరికీ ఆరోగ్యబీమా కల్పించి, ఆరోగ్య భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రభుత్వం స్పందించేంత వరకు తమ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

- రూ.7కోట్ల పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-బాసర

ఎన్నికల ప్రచారాన్ని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. బాసర సరస్వతి అమ్మవారి దర్శనం చేసుకొని మండల పరిధిలో సుమారు రూ.7 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు రైల్వే స్టేషన్ నుంచి ఆలయం వరకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని స్థానిక నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు భారీగా కార్లు, బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఆలయంలో అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ అధికారులు వీరికి ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మ వారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం నుంచి సరస్వతి అమ్మవారి ఆలయం వరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.4కోట్ల 70 లక్షలు, కిర్గుల్(కె) గ్రామంలో రూ.22 లక్షలతో శ్రీరామ మందిర నిర్మాణం, మండల కేంద్రంలో సుమారు రూ.2కోట్లతో సీసీ, డ్రైనేజీ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. రైతుబంధు, దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి, కళ్యాణలక్ష్మి, మైనారిటీలకు మైనార్టీ రుణాలను అందించి ప్రభుత్వం ఆదుకుందని అన్నారు. ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణరావు, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ రామారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్ రావు, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీ, మాజీ ట్రస్ట్ సభ్యుడు మల్కాన్న యాదవ్, జ్ఞాని పటేల్, మల్లయ్య యాదవ్, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విభజించి పాలించే పార్టీలను తరిమి కొట్టాలి

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

విభజించి పాలించే పార్టీలను తరిమి కొట్టాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మున్నూరుకాపు సంఘ భవనం ఏర్పాటుకు గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం మార్కండేయ ఆలయంలో షెడ్ల నిర్మాణంతో పాటు శ్మశాన వాటిక రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏండ్లు పాలించిన బీజేపీ కాంగ్రెస్ మహాత్మా గాంధీ ఆశయాలను పక్కన పెట్టి గ్రామ స్వరాజ్యాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో గాంధీ చేసిన నినాదాన్ని కేసీఆర్ విధానాలను ఆచరిస్తూ నిజం చేస్తూ నిజమైన గ్రామ స్వరాజ్యానికి పాటుపడుతున్నారని అన్నారు. నేడు ప్రతి గ్రామంలో గ్రామాభివృద్ధి దిశగా రోడ్లు విద్యా, వైద్యం, ఆరోగ్యం పరిశుభ్రత, హరితహారం వంటి కార్యక్రమాలను చేపట్టి గ్రామ రూపురేఖలు మార్చుతున్నారని అన్నారు. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుతూ తాగునీటి సౌకర్యం కల్పించి, అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులను సైతం దూరం చేయగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, సర్పంచ్ గంగారాం, ఉపసర్పంచ్ జయంత్, అధికార ప్రతినిధి గంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, నాయకులు, కుమ్ర రాజు, నాగేష్, నారాయణ పటేల్, కృష్ణయ్య గంగారెడ్డి, సాజిదోద్దీన్ పాల్గొన్నారు.

నేటి నుంచి 104 ఉద్యోగుల నిరవధిక సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం నుంచి కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె చేస్తున్నట్లు 104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 104లో పని చేసేటువంటి అన్ని రకాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. గత కొన్ని రోజుల నుంచి ప్రభుత్వానికి వివిధ రూపాలలో వినతిపత్రాలు ఇవ్వడం ధర్నాలు, కలెక్టరేట్ ముందు రిలే దీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. కానీ ప్రభుత్వం స్పందించకపోవడంతో చివరికి నిరవధిక సమ్మెలోకి పోతున్నట్టు తెలిపారు. జిల్లాలో ఉన్నటువంటి 104 ఉద్యోగులందరూ సోమవారం నుంచి జరిగే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేందర్, నాగ్‌నాథ్, సుభాష్, ఇబ్రహీం, రాజేందర్ పాల్గొన్నారు.

కుమురంభీం ఆశయ సాధనకు కృషి

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-బేల

కుమురంభీం స్ఫూర్తితోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని, వారి ఆశ సాధనలో కలలను నిజం చేసుకుంటున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం మండలంలోని మసాల(బి) గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. గ్రామస్తులతో కలిసి కుమురంభీం విగ్రహ ఆవిష్కరణకు భూమిపూజ చేశారు. విగ్రహ ఏర్పాటుకు పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కుల, మతాలను గౌరవిస్తూ కుమురం భీం ఆశయ సాధనకు కృషి చేసిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. గిరిజనులకు పోడు భూముల పట్టాలు, రైతుబంధు అందిస్తున్న నాయకుడు అన్నారు. కుమురంభీం ఆశయ సాధనలో భాగంగా ఆసిఫాబాద్‌కు కుమురం భీం అనే పేరును మార్చడం, జోడేఘాట్‌ను మ్యూజియంగా తీర్చిదిద్దామన్నారు. కనీస గుర్తింపు ఇవ్వని పార్టీలు రేపు మన వద్దకు వస్తే సమాధానం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండి సుజాత సుదర్శన్, సర్పంచ్ భీంరావ్, బత్తుల సుదర్శన్, బండి రవీందర్, బండి నందు, మేస్త్రం శంభు, రాజు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు సన్మానం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పోలీస్ అభ్యర్థుల ఫలితాల్లో మండల గిరిజన అభ్యర్థులు సత్తా చాటారు. దీంతో మండల సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కేస్లాపూర్‌లోని నాగోబా దర్బార్‌హాల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సారి వెలువడిన ఫలితాల్లో మండలం నుంచి 12 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కినక జుగాది రావ్ మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డలు చదువుతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. నిరుద్యోగ యువతకు పోలీసు శాఖ తరపున ఉచిత శిక్షణ ఇవ్వడం ఎంతో ఉపయోగపడిందన్నారు. పోలీసు ఉద్యోగం సాధించడంతో తన తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలన్నారు. తమ ఊరికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ వెంకట్‌రావ్, బారిక్‌రావ్, సర్పంచులు తుమ్రం లక్ష్మణ్, ఎర్మ జాకేష్, కుడే కైలాస్, పోలీసు సిబ్బంది కొడప రామారావ్, దుర్వ రమణ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పెరిక సంఘ నాయకులు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని ఆదివారం జిల్లా పెరిక సంఘ నాయకులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలు, ఎదుర్కొంటున్న సమస్యలు గురించి మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చుంచు భూమయ్య, ఉపాధ్యక్షులు సంగం వెంకట్‌రాజ్, నాయకులు భూమేష్, పెరిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



నవతెలంగాణ-బాసర

సరస్వతీదేవి అమ్మవారిని ఆదివారం ఉదయం అమ్మవారి అభిషేక సేవలో హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న వీరిని ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి అభిషేక సేవలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తిని ఆలయ మర్యాదలతో సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వీరి వెంట ఆలయ అధికారులు, ఎస్సై గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కులవృత్తులకు ఆర్థిక చేయూత చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-సిరికొండ

కులవృత్తులకు ఆర్థిక చేయూత అందజేసి వారు ఆర్థికంగా బలపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయలు అందజేస్తోంది. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీఓ అతుల్ కుమార్, స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు బీసీ రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని కులవృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమృత్ రావ్, సోంపల్లి ఎంపీటీసీ సూర్యకాంత్, పొన్న సర్పంచ్ చంద్రకళ, మాజీ సర్పంచ్ పెంటన్న, మాజీ కోఆప్షన్ సభ్యులు ఇక్బాల్, నాయకులు కదం సూర్యకాంత్, లతీఫ్, గంగన్న ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

విద్యార్థులు చదువుకునే సమయంలో ఎలాంటి మానసిక ఒత్తిడికి గురి కాకూడదని లెక్చరర్ మాదాసు మధుకర్ అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో మై డ్రీమ్స్ కం ట్రూ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మోటివేషనల్ ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రణాళిక బద్ధంగా చదివితే విద్యార్థులు ఆశించిన రీతిలో ఫలితాలను పొందవచ్చని ఆయన సూచించారు. కఠినంగా ఉన్న పాఠ్యాంశాలను విభజించి ఆసక్తితో చదవాలన్నారు. మనలో ఉన్న అసంతృప్తిని పక్కన పెడితే నిజమైన ప్రతిభ బయటకు వస్తుందన్నారు. ఎప్పుడు కూడా మనల్ని మనం నిందించుకోవద్దన్నారు. చెడు ఆలోచనలను పక్కనపెట్టి భవిష్యత్తు కోసం మంచి కలలు కనాలని వాటిని నిజం చేసుకోవడానికి నిరంతరం శ్రమపడాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కుంర సాయికృష్ణ సభ్యులు నగేష్, రాజ్‌కుమార్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లకుర్మలకు రెండో విడత గొర్ల పంపిణీ

- పశువైద్యాధికారి సరోత్తం



నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రెండో విడత గొర్ల పంపిణీ కింద మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న గొల్లకుర్మలకు ఆదివారం 12మందికి 12 యూనిట్స్ మంజూరు కావడంతో పల్సి గ్రామంలో లబ్ధిదారులకు మాజీ ఎంపీటీసీ కొట్టే హనుమల్లు, పల్సి పశు వైద్యాధికారి సరోత్తం ఆధ్వర్యంలో గొర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి సరోత్తం మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఉన్న గొల్లకుర్మలకు ప్రభుత్వం మంజూరు చేసిన గొర్లను దశల వారిగా పంపిణీ చేస్తామని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతి ఒక్కరికి గొర్లను పంపిణీ చేసేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హనుమల్లు, ఆయా గ్రామాల లబ్ధిదారులు ఉన్నారు.

బీటీ రోడ్డుకు భూమిపూజ

నవతెలంగాణ-కౌటాల



మండలకేంద్రంలోని కుమురంభీం చౌరస్తా నుంచి టేకంగూడ వరకు రూ.3.5 కోట్లతో మంజూరైన బీటీ రోడ్డుకు ఆదివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల మరమ్మత్తుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థను మెరుగుపర్చడానికి నిధులు విడుదల చేయగా అందులో మన నియోజకవర్గానికి కూడా పలు రహదారుల బీటీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, ఏఈ కృష్ణారావు, నాయకులు పాల్గొన్నారు.

బీఎస్పీకి మూకుమ్మడి రాజీనామాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణానికి చెందిన పలువురు ఆదివారం బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)కి మూకుమ్మడి రాజీనామాలు చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ 2018 అసెంబ్లీ ఎన్నికలలో బీఎస్పీ అభ్యర్థి రావి శ్రీనివాస్‌కు తాము మద్దతుగా నిలిచామని, ఆ ఎన్నికల అనంతరం పార్టీని పట్టించుకునే నాథుడే లేకపోవడంతో తాము తటస్తంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నియోజకవర్గంలో పర్యటిస్తున్నా తమను పట్టించుకోకపోవడంతో ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 11న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫైసల్ బిన్ సులేమాన్, షబ్బీర్ అహ్మద్, రఫీక్‌ఖాన్, అయ్యూబ్‌ఖాన్, మహ్మద్ షఫీ హైమద్, మేకల శంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతి భవన్ ముట్టడిస్తాం

- సీఐటీయూ మండల కన్వీనర్ కూటికెల ఆనంద్‌రావ్



నవతెలంగాణ-కెరమెరి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ప్రగతి భవన్ ముట్టడిస్తామని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనందరావ్ అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. జీఓ నెంబర్ 8 ప్రకారం పెంచిన వేతనాలు, ఏరియర్స్‌తో సహా చెల్లించాలని, కనీస వేతనం రూ.26 నిర్ణయించాలని డిమాండ్ చేశారు. గతంలో అసెంబ్లీలో ముఖ్యమంత్రి కార్మికులకు రూ.2000 పెంచుతున్నట్లు ప్రకటనలు చేసి నేటికీ అమలు చేయలేదన్నారు. పెంచిన వేతనంతో రూ.3 వేలకు ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, కొత్త మెనూ ప్రకారం రేట్లు పెంచి బడ్జెట్ విడుదల చేయాలని, అవసరమైన చోట వంట సామాగ్రి, సబ్సిడీపై గ్యాస్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంభబాయి, సోంబాయి, కవిత, పగ్గుబాయి, లక్ష్మీబాయి, భీంబాయి, బిస్మిల్లా పాల్గొన్నారు.

నేటి ధర్నా విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా అటవీ నర్సరీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నా విజయవంతం చేయాలని తెలంగాణ అటవీ నర్సరీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నర్సరీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బెజ్జూర్

మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త తండ్రి తంగెడిపెల్లి మొండయ్య మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త అయిన తంగెడిపెల్లి మొండయ్య మరణం తీరనిలోటని, కుటంబం ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డోకె వెంకన్న, బశరత్‌ఖాన్, పుల్లూరి సతీష్, నాహెర్ అలీ, జావీద్ పాల్గొన్నారు.

నాలుగేళ్లలో బీఎస్పీ కండువా కప్పుకున్నారా..?

నవతెలంగాణ-కాగజ్‌నగర్

గత నాలుగేళ్లుగా ఏనాడూ బీఎస్పీ కండువా కప్పుకోని వారిని బీఆర్ఎస్‌లో చేర్పించుకొని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కొత్త నాటకం ఆడుతున్నారని బీఎస్పీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ భయం పట్టుకుందని, దీంతోనే ఆయన బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు కానీ వారిని తన పార్టీలో చేర్పించుకుంటూ డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. వీరు నిజంగా బీఎస్పీ నాయకులే అయితే ఇన్నాళ్లు బీఎస్పీ కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుండి బీఎస్పీలోకి వలసల పరంపర పెరుగుతుండడంతోనే దిక్కుతోచని ఎమ్మెల్యే దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలో బీఎస్పీ నుంచి గెలిచి నెల రోజులు కాకుండానే ఆ పార్టీకి మోసం చేసి బీఆర్ఎస్‌లో చేరిన కోనప్పను బహుజనులు మర్చిపోరని, రాబోయే ఎన్నికలలో తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు నక్క మనోహర్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో నేత కార్మికుడు ఆత్మహత్య

నవతెలంగాణ-మంచిర్యాల

మండలంలోని కర్ణమామిడి గ్రామానికి చెందిన బోగ మొగిలి(44)అనే నేత కార్మికుడు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. హాజీపూర్ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం బోగ మొగిలి నర్సింగ్ రాజేశ్వర్‌రావు పల్లెల్లో టెక్స్‌టైల్ కంపెనీ పెట్టుకొని బట్టలు నేచే శాంచలను లోన్‌లో తీసుకున్నాడు. అతనే స్వంతంగా బట్టలు నేచి అమ్ముకునే వాడు. కరోనా కారణంగా సరిగ్గా నడవక పోవడంతో నష్టం వచ్చింది. లోన్ కట్టలేక పోవడంతో బట్టలు నేచే శాంచాలు అమ్మి లోన్ మొత్తం చెల్లించాడు. అప్పటి నుండి కుటుంబ భారం, అప్పులు పెరిగాయి. దీంతో అప్పుల బాధ ఎక్కువై తను నేచిన కంపెనీలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి 18, 16 సంవత్సరాల కొడుకు, కూతురు ఉన్నారు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పులాజీ బాబా సంస్థాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైనూరు మండలం పాట్నాపూర్ గ్రామంలో గల పులాజి బాబా మందిరానికి రెండు కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యంలో సంస్థాన్ సభ్యులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి క్యాంపు కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి భక్తులు ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుచున్నప్పటికీ గతంలో పాలకులు పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రెండు కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ నిధులతో ఆలయ పరిధిలో భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడానికి మార్గం సుగమమైందని తెలిపారు. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేష్, సంస్థాన్ అధ్యక్షులు కేశవరావు, కమిటీ సభ్యులు శంకర్ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. ఆదివారం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు టీకానంద్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న 317 జీవోను రద్దు చేయాలన్నారు. కాగజ్‌నగర్ ఎస్‌పీఎం ఫ్యాక్టరీలో జిల్లా వాసులకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలని ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించడంతోపాటు జిల్లా వ్యాప్తంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఖిరిడి గ్రామానికి రోడ్డు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రోజురోజుకు నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుందని ఉపాధి లేక యువత చాలా ఇబ్బందులు పడుతున్నారని ఉపాధి అవకాశాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఉపాధి కల్పించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదని, ఉపాధి కోసం కనీసం కార్పొరేషన్ లోన్లు కూడా సరైన నిరుద్యోగ యువతకు ఇవ్వడం లేదని ఆరోపించారు. నిరుద్యోగులు చదువుకోవడానికి గ్రంథాలయాలు స్టడీ సెంటర్లు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. గిరిజన ప్రాంతాలకు సరైన రోడ్డు సౌకర్యాలు లేక త్రాగునీటి సౌకర్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించకుంటే రానున్న రోజుల్లో అధికార పార్టీ నాయకులను ఎన్నికల్లో ఓడించటానికి ప్రజలతో కలిసి పనిచేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వడ్లూరి శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శిలు ఆత్మకుడి సతీష్, తాళ్లపల్లి రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు రౌతు సవిత, కుర్మిత లక్ష్మి జిల్లా నాయకులు దుర్గం రాజ్ కుమార్, జ్యోతి పాల్గొన్నారు.

గృహలక్ష్మీ లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ



నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా అందించే సొంతింటి నిర్మాణం కోసం అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదివారం ప్రభుత్వం జారీ చేసి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకం నిరంతరంగా కొనసాగుతుందని, మొదటి విడతలో మంజూరైన లబ్ధిదారులకు ఉత్తర్వుల పత్రాలను అందజేయడం జరిగిందని, దశలవారీగా ఇల్లు లేని నిరుపేదలకు ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణం కోసం గృహలక్ష్మి పథకం ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాలన్నారు. మండలస్థాయి, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తేనే విజయాన్ని సాధిస్తామని, ఎవరు అధైర్య పడొద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, స్థానిక సర్పంచ్ మౌనీష్, మొగడ్‌దగడ్ ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్, బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బతుకమ్మ పండుగను మహిళలు ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని గుండి, చోర్‌పల్లి గ్రామాల్లో బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండగకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చిందన్నారు. దీనిలో భాగంగా మహిళలకు బతుకమ్మ కానుకగా చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు సుఖసంతోషాలతో పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. అనంతరం చోర్‌పల్లిలో నూతనంగా నిర్మించే గ్రామపంచాయతీకి భూమి పూజ చేశారు. ప్రభుత్వం తరఫున యువకులకు క్రీడా సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు జబరి అరుణ, కమ్మరి రోజా, ఉపసర్పంచ్ పెద్దపల్లి సునీత, ఏఎంసీ డైరెక్టర్ దాంపెల్లి శ్యామ్‌రావ్, మాజీ ఎంపీటీసీ జబరి రవీందర్, మాజీ సర్పంచులు సెండే దత్తు, చిట్ల నారాయణ, మిట్ట తిరుపతి, రోజా, రాజు, కోఆప్షన్ సభ్యులు గణపతి, నాయకులు సుంకరి పెంటయ్య, కమలాకర్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల

శ్రమ దోపిడి చేస్తున్న ప్రభుత్వాలు

- 13, 15వ తేదీల్లో ఎమ్మెల్యే ఇండ్ల ముందు ధర్నాలు
- సింగరేణి యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తే మరో సమ్మె తప్పదు
- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఓదెలు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న 30వేల మంది కాంట్రాక్టు కార్మికుల శ్రమను గుర్తించి వేతనాలను పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా వ్యవహరిస్తున్నాయని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు ఆరోపించారు. వేతనాల పెరుగుదల, లాభాల వాటా ఒప్పంద అమలుకై ఈ నెల 9న చలో హైదరాబాద్‌కు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. 13, 15వ తేదీల్లో ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. 10 సంవత్సరాలు గడుస్తున్నా కనీస వేతనాల జీఓను విడుదల చేయకుండా వెట్టిచాకిరి చేయిస్తూ కోట్ల రూపాయల లాభాలను గడిస్తున్నారన్నారు. 2021 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 22ను విడుదల చేసి సంవత్సరాలు గడుస్తున్నా నేటికి గెజిట్ చేస్తూ, కార్పొరేటర్ల కొమ్ము కాస్తు కార్మికుల పొట్ట కొడుతున్నారన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా కార్మికుల విషయంలో కర్కషంగా వ్యవహరిస్తూ జాతీయ కనీస వేతనం రోజుకు రూ.178 నిర్ణయించి కాంట్రాక్టు కార్మికుల బతుకులను ఆగం చేయాలని చూస్తుందన్నారు. ఒకవైపు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, మరోవైపు విపరీతమైన పని భారం పెంచుతూ కార్మికుల వేతనాలు మాత్రం పెంచడం లేదన్నారు. ఈ మధ్యకాలంలో భరించలేని పని భారం, కుటుంబాన్ని పోషించుకోలేని వేతనాలతో మానసికంగా మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు కూడా చోటుచేసుకున్నాయన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 22ను గెజిట్ చేయించి కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. దీని కోసం ఈ నెల 9న హైదారబాద్ రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నా, ఈ నెల 13, 15వ తేదీల్లో సింగరేణి వ్యాప్తంగా ఉన్న కోల్‌బెల్టు ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయం వద్ద ధర్నాల్లో కాంట్రాక్టు కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించి వేతనాలు పెంచకుంటే సింగరేణిలో మరో సమ్మెకు సైతం సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

అమిత్‌షా బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా స్థానిక డైట్ కళాశాల మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లను ఆదివారం జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. భద్రత చర్యలు, ట్రాఫిక్‌పై సమీక్ష నిర్వహించి సిబ్బందికి, అధికారులకు సూచనలు చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి పర్యటనలో ఎలావంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

జ్యోతిబా పూలే వార్షికోత్సవాలను విజవంతం చేయాలి

- మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోసే శంకర్



నవతెలంగాణ-కెరమెరి

జ్యోతిబా పూలే వార్షికోస్తావాలను విజవంతం చేయాలని మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోసే శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10వ తేదీ నుంచి 15, 17వ తేదీ వరకు వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలను జిల్లాలోని మాలి సంఘం మాలి గ్రామాలలో వార్షికోత్సవ జండా పండగను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. వార్షికోత్సవ ముగింపు సందర్భంగా మాలీ సమాజం నుంచి కొత్తగా కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎన్నికైన అభ్యర్థులకు సన్మాన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కానిస్టేబుల్ ఎంపికైన యువకులు వారి వివరాలను ఈ క్రింది నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బీసీ కమ్యూనిటీ హాలులో సన్మాన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం డివిజన్ అధ్యక్షులు గుర్నూలే మెంగాజీ. కెరమెరి మాలీ సంఘం అధ్యక్షులు కావుడే తులసిరాం, నాయకులు శెండే నారాయణ, కావుడే దత్తు. శెండే సోమేశ్వర్ మాలీ సంఘం తిరుపతి పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి
- వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో అభివృద్ధి తమ ప్రభుత్వంతోనే సాధ్యమని జిల్లా జడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఆర్ నగర్‌లో హనుమాన్ ఆలయానికి కాంపౌండ్ వాల్, కాలనీలో సీసీ రోడ్లుతోపాటు బజార్ వాడలో కమ్యూనిటీ భవనానికి జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావుతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోయిందన్నారు. దేశ అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో విజయం ఖాయమని ప్రజల ఆదరణ తమకే ఉందని అన్నారు. అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలన్నారు. అనంతరం బజారువాడలో బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టారు. తెలంగాణ ఆడపడుచులను గౌరవించుకోవడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. బతుకమ్మ పండుగ సంతోషాలతో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సింగల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అహ్మద్, నాయకులు నిస్సార్, అహ్మద్, రాపర్తి శంకర్, సదాశివ్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

కుమురంభీం వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఆత్రం బొజ్జి రావు

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని పొరుగడ్డ జోడేఘాట్‌లో కుంరంభీం 83 వర్ధంతి ఉత్సవ కమిటీను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చౌపన్‌గూడ గ్రామానికి చెందిన ఆత్రం బొజ్జి రావు, కన్వీనర్‌గా పెందూర్ లక్ష్మణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భీం వర్ధంతి ఉత్సవ కమిటీ ఎన్నిక కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థి సంఘం నాయకులు, సర్మేడిలు, పటేళ్ల, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలి

- జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 10వ తేదీన ఆదిలాబాద్‌లో జరిగే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కార్యాలయంలో తాలూకా కన్వీనర్ సొల్లు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన తాలూకా సన్నాహక కార్యక్రమానికి జిల్లా ఇన్‌ఛార్జి ఆరుముళ్ళ పోశం, వెంకటరమణలతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అనేక నిధులు మంజూరు చేసిందన్నారు. తాజాగా గిరిజన యూనివర్సిటీతో పాటు పసుపు బోర్డు ఏర్పాటు కూడా నిర్ణయం తీసుకున్నట్లు గుర్తు చేశారు. మంగళవారం జరిగే సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు ప్రజలు తరలి రావాలని ఆ దిశగా నాయకులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నాక్ విజయ్, షేర్ల మురళిదర్, పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, నాయకులు బాలకృష్ణ, రమేష్ గౌడ్, సోము, తిరుపతి, వెంకటేష్, రమేష్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కస్తూర్భా విద్యార్థినులను పరామర్శించిన నాయకులు

నవతెలంగాణ-తాండూర్

అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై కళ్ళు తిరిగి పడి పోయిన కన్నెపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థినులను, బీజేపీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొయ్యల ఏమాజీ సీపీఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రేగుంట చంద్రశేఖర్ పరామర్శించారు. ఆసుపత్రిలో విద్యార్థినులను వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి సరైన వైద్యం అందేలా చూడాలని డాక్టర్స్, పాఠశాల ప్రిన్సిపాల్ వినీతను కోరారు. పాఠశాల సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో స్థానిక ఎమ్మెల్యే జిల్లా అధికారులు వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కారం చేయాలనీ డిమాండ్ చేశారు. ఆసుపత్రిని సందర్శించి, పరామర్శించిన వారిలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, జిల్లా సీనియర్ నాయకులు దూది ప్రకాష్, కన్నె పల్లి మండల అధ్యక్షుడు రామయ్య యాదవ్ పాల్గొన్నారు.

అమ్మ ఒడి అన్నదాన కార్యక్రమం

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలో ప్రతి ఆదివారం రోజు అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్ట్ టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. 215వ వారాలు అన్నదాన కార్యక్రమంలో భాగంగా కాంటా చౌరస్తా వద్ద కూలీలకు, బాటసారులకు, సుమారు 200 మందికి అన్నదానం చేయడం జరిగింది. అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్ మంచిర్యాల జిల్లా బ్రాంచ్ మేనేజర్, టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు తనుగుల క్రాంతి కుమార్-సుమలత, కార్తిక్-శ్రేద్ధ, స్పందన-శ్రావణ్ కుమార్, అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, గన్నెవరం తిరుమల చారి, సిద్దమల్ల రఘు, యూసుఫ్, చెందుపట్ల లింగన్న అనురుత్, సాయి కార్తికేయ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం



నవతెలంగాణ-చెన్నూర్

పట్టణంలోని మైనారిటీ పంక్షన్ హాల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2002-03 సంవత్సరపు పదవ తరగతి చదువకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. విద్య నేర్పిన ఉపాధ్యాయులు, పిఈటి రాములు హాజరై మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం విద్యనభ్యసించిన విద్యార్థులు ఒక సమావేశం ఏర్పాటు చేసుకోని దానికి అప్పటి ఉపాధ్యాయులందరిని ఆహ్వానించడం గోప్ప విషయం అని కోనియాడారు. గురు శిష్యుల అనుభందం మహోన్నతమైనదని కోనియాడారు. తమ విద్యార్థులు ప్రయోజకుడైన నాడే ఉపాధ్యాడుడికి అసలైన సంతోషమని తెలిపారు. డ్రాయింగ్ టీచర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎక్కడో రాజమండ్రి నుంచి ఎదో తెలియని భయంతో పట్టణానికి అప్పట్లో విద్య నేర్పించడానికి వచ్చానని, కానీ వచ్చిన కోంత కాలానికే పలువురు విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు వారి ప్రేమ, అప్యాయతలు పంచారని, చెన్నూర్ నా జీవితంలో మరుపురాని అప్తులను, శిష్యులను అందించిందని తెలుపారు. గత 20 సంవత్సరాలలో రోజుకు ఒక్కసారైన చెన్నూరు గుర్తు చేసుకుంటూ వుంటానని తెలిపారు. ఈ సందర్భంగా బయాలజి టీచర్ గిరీష్ జన్మదిన వేడుకలను నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు చింతల లక్ష్మణ్, సప్ప శ్రీకాంత్, అడువాల రమేష్, సురేష్ పాల్గొన్నారు.

కాన్షీరాం వర్ధంతి సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-మందమర్రి

కాన్షీరాం వర్ధంతి సభను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంపీ గుణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఎస్పీ మందమర్రి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవునూరి సంపత్, కెతావత్ కృష్ణ నాయక్, జిల్లా అధ్యక్షుడు ఎంపీ గుణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశానుసారం అక్టోబర్ 9వ తేదీన బహుజన సమాజ్ వ్యవస్థాపకులు కాన్షీరాం 17వ వర్ధంతి సభకు జిల్లా నుంచి ఎవరి చద్ది వాళ్ళు పట్టుకొని హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే సభకి భారీగా తరలి రావాలని పార్టీ శ్రేణులకు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మహిళా కన్వీనర్ బొడ్డు వినోద, చెన్నూరు నియోజకవర్గం అధ్యక్షుడు తుంగపిండి రమేష్, బెల్లంపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వరప్రసాద్, కృష్ణ, రాజ్ కుమార్, సిద్దు, జశ్వంత్, ధర్మరాజు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల సంఘం నాయకుడు బాలగోపాల్ వర్ధంతి



నవతెలంగాణ-కాసిపేట

మండలకేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మానవ హక్కుల సంఘం నేత డాక్టర్ బాలాగోపాల్ 14వ వర్ధంతిని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి మాట్లాడారు. కాసిపేట ఓపెన్ కాస్ట్ అడ్డుకోవడంలో బాలాగోపాల్ పాత్ర మరువలేనిదని, తాడిత, పీడిత ప్రజల హక్కుల కోసం అయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీమన్నారాయణ, పల్లె మల్లయ్య, సిలోజు మురళీ, దాసరి రాజయ్య, కొమ్ముల బాపు, గోనెల శ్రీనివాస్, బోగే పోశం, కలవల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదివారం కవ్వాల్ ఏజెన్సీ గ్రామపంచాయతీలో గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ముందుగా ఆ గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిపారు. మరోసారి ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవడానికి ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఫజల్ ఖాన్ మండల కో-ఆప్షన్ మున్వర్ అలీఖాన్, దినేష్ నాయక్ భూక్య కలిరామ్, రాజలింగు మూతన్న పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- కాసిపేటలో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధిపనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నవతెలంగాణ-కాసిపేట

మహిళల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విస్తతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు గ్రామస్తులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. పెద్దనపల్లిలో ఎన్డీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, మామిడిగూడెంలో ఎస్ఎఫ్, డీఎంఆర్జీ నిధుల నుంచి రోడ్డు, కాసిపేట, కేంద్ర నిధులు డీఎంఎల్టీ, ఎన్డీఎఫ్ నిధులు రూ.24 లక్షలతో సీసీ రోడ్డు, ముత్యంపల్లిలో రూ.18 లక్షలతో మహిళా సమాఖ్య భవనం, కోమటిచేనులో రూ.15 సీసీ రోడ్లు, పల్లంగూడ, తంగళ్లపల్లి, కోనూర్, లంబాడీతాండ(డీ)లో పలు అభివృద్ధి పనులు, తాటిగూడలో నూతన గ్రామ పంచాయతీ నిర్మాణానికి, మల్కేపల్లిలో రూ.18 లక్షలతో ఐకేపీ భవనం, సీసీ రోడ్డు, మెటల్ రోడ్డు నిర్మాణానికి, సోనాపూర్లో సీసీ రోడ్డు, వెంకటాపూర్‌లో సీసీ రోడ్డు, షెడ్ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. దేవాపూర్‌లో సీసీ రోడ్లు రూ.39 లక్షలతో, మహిళా సమాఖ్య భవనం రూ.18 లక్షలతో, మద్దిమాడలో మహిళా సమాఖ్య భవనం నిర్మాణ పనులు, కొండాపూర్ తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, ఐకేపీ భవనం నిర్మాణ పనులను ప్రారంభించారు. దీంతో పాటు క్రీడాకారులకు క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ పేద రైతు బిడ్డగా పేద ప్రజల కష్టాలు తెలుసని, మీ వెంటే ఉంటున్నానని, ప్రజలే నా బలం, బలగమని, ఎన్నికల సమయంలో మాత్రమే డబ్బుల సంచులతో వచ్చే వారిని ప్రజలు నమ్మరని, లక్షల కోట్ల వ్యాపారం చేసే వారు నాపై పోటీకి మరో సారి వస్తున్నారని అన్నారు. ప్రజలతో కలిసి ఉండే నన్ను మూడో సారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రంరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు దుర్గం పోశం, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, సర్పంచ్లు ఆ బాదు, మడావి తిరుమల అనంతరావు, రాంటెంకి శ్రీనివాస్, వేముల కృష్ణ, సంపత్ నాయక్, స్వప్న, తిరుపతి, లక్ష్మీ, ఓసీసీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్లు బోయిని తిరుపతి, పిట్టల సుమన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజులారెడ్డి పాల్గొన్నారు.

బీసీ జనగణన చేపట్టేవారికే బీసీల మద్దత్తు



నినాదాలు చేస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

నవతెలంగాణ-మంచిర్యాల

రాబోయే జనాభా లెక్కల్లో భాగంగా దేశవ్యాప్తంగా బీసీ జనగణనను వెంటనే చేపట్టాలని బీసీ ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మంచిర్యాలలోని బీసీ ఐక్యవేదిక సంఘ భవనంలో నిర్వహించినబీహార్ 'బీసీ జన గణన విజయోత్సవ సభ'లో వారు పాల్గొని ప్రసంగించారు. స్వతంత్ర్య భారత చరిత్రలో తొలిసారిగా బీహార్ రాష్ట్రంలో బీసీ జన గణన చేపట్టిన నితీష్ కుమార్ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందని వారు పేర్కొన్నారు. 2021 జనాభా లెక్కల్లో జనగణన చేపడతామని 2018లోనే పార్లమెంటు వేదికగా హామీనిచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం నేడు అగ్రవర్ణాల ఒత్తిళ్లకు తలొగ్గి బీసీ వర్గాలకు అన్యాయం చేయడం తగదని వారు తెలిపారు. ప్రభుత్వ నిధులు, సంక్షేమ పథకాల విషయంలో బీసీ వర్గాలకు దక్కాల్సిన వాటా, రిజర్వేషన్ల కోటా తేలాలంటే జనాభా లెక్కలు తేలితేనే సాధ్యమవుతుందని వారు తెలిపారు. బీసీ జనాభా లెక్కలు సేకరిస్తే దేశంలో కులతత్వం పెరిగిపోతుందంటూ అహేతుక వాదనలను ముందుకు తీసుకొచ్చి, మెజారిటీ ప్రజల న్యాయమైన డిమాండును తిరస్కరించాలని చూస్తున్నారని విమర్శించారు. పార్లమెంటులో హామీ ఇచ్చిన విధంగా బీసీ జన గణన చేపడతామని మోడీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో పశువులకు సైతం లెక్కలు ఉన్నప్పుడు మెజారిటీగా ఉన్న బీసీ వర్గాల జనాభా ఎంతో తేల్చడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. మెజార్టీ వర్గమైన బీసీ ప్రజల న్యాయమైన హక్కులకు కట్టుబడిన వారికే దేశాన్ని పాలించే అర్హత ఉందన్నారు. బీసీ వర్గాల ప్రజల న్యాయమైన హక్కులను దెబ్బతీస్తున్న అగ్రవర్ణ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ జనగణన సాధన కోసం జరగనున్న ఉద్యమాలలో జిల్లాలోని ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక కన్వీనర్ ఒడ్డెపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీనియర్ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సింగరేణి బీసీ సంఘర్షణ సమితి నాయకులు సమ్మ రాజన్న, మాడిశెట్టి విశ్వం, బుద్దె చంద్రమౌళి, ముత్యాల శ్రీనివాస్, మొగిలి లక్ష్మణ్, కిరణ్ కుమార్, అఖిల్, మోర చరణ్ కుమార్, పాయిరాల రాములు, రవూఫ్ పాల్గొన్నారు.

మండల అభివద్ధికి ఆటంకంగా మారిన అటవీ ఆంక్షలు



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని జక్కు లచ్చవ్వ-బుచ్చయ్య ఆర్యవైశ్య భవనంలో ఆదివారం సేవ్ జన్నారం-అటవీశాఖ ఆంక్షలు తొలగించాలి, అనే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కవ్వాల్ టైగర్ జోన్ పేరిట విధించిన ఆంక్షల వలన దినదినము మండల అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. భారీ వాహనాలను అనుమంతిచక పోవడం వలన కూరగాయల అమ్ముకునే వారి నుంచి ప్రతి ఒక్క వ్యాపారం దెబ్బతిన్నది. అంతేకాకుండా నిత్యావసర వస్తువులపై ఆదనపు భారం పడుతుంది. అలాగే అటవీ శాఖ చెక్ పోస్ట్ ల వద్ద పర్యావరణ సెస్ పేరిట డబ్బులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. 2012 సంవత్సరంలో ఏర్పాటు చేసిన కవ్వాల్ టైగర్ జోన్‌లో 11 సంవత్సరాలు గడిచిన ఒక్క పులి కూడా ఆవాసం చేసుకోలేదన్నారు. అటువంటప్పుడు ఇన్ని ఆంక్షలు ఎందుకని ప్రశ్నించారు. ఇది ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో మన పిల్లల భవిష్యత్తు, మన ఊరు అంధకారం అయిపోతుందని అన్నారు. అటవీశాఖ ఆదిలాబాద్, నిర్మల్ నుండి జన్నారం మీదుగా లక్షెట్టిపేట్ వరకు భారీ వాహనాల రాకపోకలపై నిషేధాన్ని పుర్తిగా ఎత్తివేయాలన్నారు. అటవీశాఖ చెక్ పోస్టులపై పర్యవరణ సెస్ పెరిట వసూళ్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల వాహనాల(కార్లు జీపులు, బస్సులు)ను రాత్రి సమయంలోను అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, వాహన యజమానులు, యువకులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కన్నెపల్లి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు అస్వస్థత



నవతెలంగాణ-తాండూర్

మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆదివారం 12 మంది విద్యార్థులు అస్వస్థతతో అకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడిపోయయారు. కళ్ళు తిరిగి పడిపోయిన విద్యార్థులను పాఠశాల వాచ్మెన్ విద్యార్థినిలను 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకలగా ఉన్నట్లు డీఈఓ యాదయ్య తెలిపారు. సంఘటన స్థలాన్ని తాండూరు సీఐ శ్రీనివాసరావు సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలను సందర్శించి పరిస్థితులను వాకాబు చేశారు. అస్వస్థత గురైన విద్యార్థుల్లో పెట్లెట్స్ తక్కువగా ఉన్నట్టు వైద్యాధికారులు నిర్ధారించారు. విద్యార్థులకు వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే సంఘటన జరిగినట్లు విద్యార్థి సంఘాలు ఆరోపించారు. భానుమతి చేతబడి పేరుతో విద్యార్థుల్లో అలజడి సృష్టిస్తున్నారని మూఢనమ్మకాలు నమ్మవద్దని తాండూర్ సీఐ శ్రీనివాస రావు తెలిపారు.

పరామర్శించిన విద్యార్థి సంఘాల నాయకులు

బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శ్వాసకోశ వ్యాధితో కళ్ళు తిరిగి పడిపోయిన విద్యార్థులను అక్కడ వున్నటువంటి వాచ్మెన్ విద్యార్థులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెల్లారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు అల్లి సాగర్‌రెడ్డి చరణ్, శ్రీకాంత్, ప్రసాద్ వెంకటేష్, హుటాహుటీన ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులను పరామర్శించారు. పై అధికారులకు సమాచారం ఇస్తు విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు పోచంపల్లి హరీష్, శనిగారపు శ్రావణ్, పశువులేటి వెంకటేష్ పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాలపూర్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలంలోని గంగన్నపేట గ్రామానికి చెందిన బోర్లకుంట కొండయ్య(47) పనిమీద ఊరికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్న సందర్భంలో లక్షెట్టిపేట్ వద్ద ఆటోలో ఎక్కి, వస్తుండగా మార్గం మధ్యలో తపాలాపూర్ చెక్‌పోస్టు వద్ద, ఇంకో ఆటో ఓవర్టేక్ చేసి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న కొండయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అతివేగంగా ఆటోను నడిపి ప్రమాదానికి కారణం అయిన డ్రైవర్‌పై కేసునమోదు చేయాలని మృతుడి భార్య బోర్లకుంట మల్లవ్వ ఇచిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- 9 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్



నవతెలంగాణ-మందమర్రి

పేకాట శిబిరంపై దాడి చేసి 9 మంది పేకాట రాయుళ్లని అరెస్టు చేసినట్లు మందమర్రి ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం మందమర్రి మారుతి నగర్‌లోని ఒక ఇంటిలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై చంద్రకుమార్ తన సిబ్బందితో కలిసి రైడ్ చేయగా కట్ట అంజికి సంభందించిన నివాస గృహంలో అంజితో కలిసి పేకాట ఆడుతున్న మరో 8 మందిని పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో విద్యానగర్‌కి చెందిన పల్లపు ఏడుకొండలు, కంప రవి, తన్నీరు రవి, శ్రీరామ్ గోపి, తన్నీరు అంకమ్మ, తన్నీరు రవి, శాంతి నగర్‌కి చెందిన తాడుపెళ్లి నారి, రామన్ కాలనీకి చెందిన ధనకుంట్ల కుమార్, మారుతీ నగర్‌కి చెందిన కట్ట అంజిలు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్సై చంద్రకుమార్ మాట్లాడుతూ పట్టుబడిన 9మంది వ్యక్తుల నుండి రూ.20170 నగదు, 3ద్విచక్ర వాహనాలు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అడవి జంతువులపై ప్రేమ, దయ కలిగిఉండాలి



నవతెలంగాణ-జన్నారం

ప్రతి ఒక్కరూ జంతువులపై దయ, ప్రేమ, కరుణ కలిగి ఉండాలని జన్నారం ఎఫ్డీఓ మాధవరావు అన్నారు. ఆదివారం 69వ వన్యప్రాణి వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జన్నారం రేంజ్ పరిధిలోని గేట్ నంబర్-1 వద్ద విద్యార్థులు అటవీ శాఖ అధికారులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారం రోజులుగా వన్యప్రాణి పక్షులపై, నిర్వహించిన క్విజ్ వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. కార్యక్రమంలో, జన్నారం ఎంపీటీసీ మహమ్మద్ రియాజుద్దీన్, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముగా కమలాకర్, ఎఫ్ఆర్ఓ లు ఆఫీస్ ఉద్దీన్, పోచమల్లు, ఎఫ్ఎస్ఓలు ఎఫ్బి వోలు బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

నేడే ప్లెస్‌క్లబ్, గ్రంథాలయం ప్రారంభోత్సవం



నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రెస్‌క్లబ్, గ్రంథాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నట్టు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మానేటి రామ్మోహన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్, గ్రంథాలయ భవనం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎంఎల్‌సీ దండె విఠల్, జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కాడె, జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో పాటు నాయకులు, అధికారులు పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియతో పాటు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | అక్టోబర్ 09, 2023 | www.navatelangana.com

కుటుంబాన్ని పరామర్శించిన అనిల్ జాదవ్

నవతెలంగాణ-తలమడుగు



మండల కేంద్రానికి చెందిన చెన్నమనేని చంద్రభగ ఆదివారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి ధైర్యంచ చెప్పి సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మాజీ విజయ డెయిరీ చైర్మెన్ లోకభూమారెడ్డి, డీసీసీబీ చైర్మెన్ అడ్డిభోజా రెడ్డి, సంజీవరెడ్డి, కరుణాకర్ రెడ్డి ఉన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్



గణేష్ నిమజ్జన శోభయాత్రలో విద్యుత్ ప్రమాదానికి గురైన బాధితులకు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం ప్రభుత్వ పాఠశాల 1999-20 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు రాకేష్, ఓర్సు రాకేష్‌లకు రూ.10 ఆర్థిక సహాయం అందించి ఉదారత చాటారు. ఈ కార్యక్రమంలో జన్నారపు శంకర్, కత్తులపురం ప్రవీణ్, నవీన్, రవి, ఏనుగుందుల నరేష్, పడకంటి రాజు, పరిమల్, లోకిని, జూనికుమార్, సంతోష్ రెడ్డి, వెంకటసాయి గౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడీ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని దిలావర్‌పూర్ తాండాలో ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై యాసిర్ అరాఫత్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేస్తున్న స్థావరాన్ని గుర్తించిన పోలీసులు దాడి చేసి 300లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని, తయారు చేస్తున్న బ్యారిల్లు, బకెట్లను ధ్వంసం చేశారు. తాండాల్లో ఎవరైనా గుడుంబా తయారు చేసిన, విక్రయాలను ప్రోత్సహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎస్సై వెంట హెడ్ కానిస్టేబుల్ గంగారెడ్డి, కానిస్టేబుల్ రమేష్, హోంగార్డ్ వెంకట్‌రావ్, రమణ ఉన్నారు.

నర్సాపూర్(జి)లో...

మండలంలోని బర్గుపల్లి(జి) గ్రామంలో ఆదివారం పోలీసులు 10లీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. అక్రమంగా గుడుంబా క్యాన్లను తరలిస్తుండగా సిబ్బందితో కలిసి ఎస్సై రవీందర్ నిందితులను పట్టుకున్నారు. గుండ తయారు చేసిన, అమ్మిన చర్యలుంటాయన్నారు. పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

మేరు సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పీజీహెచ్‌ఎంగా పదోన్నతి పొందిన రాపర్తి నరేష్, పదవీ విరమణ పొందిన ఆర్మీ జవాన్ పోల్పెల్లి వెంకటస్వామిలను మేరు సంఘం ఆధ్వర్యంలో సత్కారించారు. ఆదివారం వీరిని శ్రీవిఠల రుక్మిణి దేవి ఆలయంలో శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. పోల్పెల్లి వెంకటస్వామి 24 సంవత్సరాలు ఆర్మీలో ఉద్యోగం చేసి చెన్నైలోని వెల్లింగ్టన్ నుండి పదవి విరమణ పొందాగా, బోథ్ మండలం సొనాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రాపర్తి నరేష్ బజార్‌హత్నూర్‌లో పీజీహెచ్‌ఎంగా పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎన్నవార్ రాజు, పట్టణ అధ్యక్షులు పోల్పెల్లి నాందేవ్, కర్నేవార్ పరమేశ్వర్, కార్యవర్గ సభ్యులు కులస్తులు, ఆలయ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ- సుల్తానాబాద్

ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోలేటి రమేష్ అన్నారు. ఆదివారం సుల్తానాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో నూతనంగా జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన పల్ల అపర్ణ సురేష్ ప్రమాణస్వీకారోత్సవ సభ, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కోలేటి రమేష్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో , జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లంకి లింగమూర్తి ,ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగల వెంకటనారాయణ, జిల్లా ఎన్నికల అధికారి కొమురవెల్లి రాజేందర్, రాష్ట్ర నాయకులు మొగిలపల్లి కృష్ణమూర్తి, జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు పెద్ది వెంకటేష్, జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి పద్మ, కోశాధికారి శ్రావణి, ఉమ్మడి జిల్లాల ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య మహిళా జిల్లా అధ్యక్షురాలు పల్ల అపర్ణ సురేష్ దంపతులను ఘనంగా సన్మానించారు.

బతుకమ్మ ఆడుతూ మధ్యాహ్నం భోజన కార్మికుల నిరసన

నవతెలంగాణ-మల్లాపూర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు ఈ పోరాటం కొనసాగుతుందని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు సరిత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విద్యావనుల కేంద్రం వద్ద బతుకమ్మ ఆడుతూ మధ్యాహ్నం భోజన కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కొత్త మెనూ సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు సరిత, లక్ష్మి, రుక్మ నరసవ్వ తదితరులున్నారు.

ఆశాల వంటావార్పు

నవతెలంగాణ-మల్లాపూర్

తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు రోడ్డుపైనే వంటావార్పు చేసి అక్కడే భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనంతరం వారు మాట్లా డుతూ.. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషికాలను రూ.18 వేలకు పెంచి, ఫిక్స్ వేతనం ఇవ్వాలన్నారు. ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో లయ, శిరీష,లావణ్య,స్వప్న, రమ, వసంత, లత,శాంత, రాజేశ్వరి,ప్రేమలత, సరిత పాల్గొన్నారు.

పెద్ద చెరువులో బోటింగ్ ప్రారంభం

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలోని పెద్దచెరువులో ఆదివారం కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు బోటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దడంతో పాటు చెరువును పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రానవేణి సుజాత సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు , కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న డబ్బు పట్టివేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 25 లక్షల 33 వేలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి వివరాలను తెలియజేశారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. టూ టౌన్ సీఐ అశోక్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్ సాయినాథ్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ బృందాలతో నిరాంతరం తనిఖీలు జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలోనే శనివారం అర్ధరాత్రి విశ్వనీయ సమాచారం మేరకు ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వేళ్తున్న ఆర్టీసీ బస్సులో ఎలాంటి పత్రాలు లేకుండా డబ్బులు తీసుకేళ్తున్న ఇద్దరి వద్ద నుంచి రూ. 25 లక్షల 33 వేల 300లను స్వాధీనం చేసుకున్నామన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సజ్జనపు లక్ష్మీనారాయణ వద్ద రూ.20 లక్షల80వేలు, కుంబారం ప్రజాపత్ వద్ద రూ 4 లక్షల53 వేల300 నగదుకు సంబంధించి ఎలాంటి సరైన పత్రాలు లేవన్నారు. వీరి వద్ద నుండి డబ్బు స్వాధీనం చేసుకొని సజ్జనపు లక్ష్మీనారాయణ వద్ద లభించిన డబ్బును ఆదాయపన్ను శాఖ, ప్రజాపత్ లభించిన డబ్బును జిల్లా యంత్రాంగం ద్వారా నియమించబడిన ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ టీంలకు అప్పగించడం జరుగుతుందన్నారు. ఎలక్షన్ల సందర్భంగా ప్రజలందరూ ఎలాంటి సందర్భంలోనైనా డబ్బును తీసుకువెళ్లే క్రమంలో సరైన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

- అనసూయ పవార్ ట్రస్ట్ చైర్మెన్ రామారావు పటేల్



రామారావు పటేల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-భైంసా

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలక పాత్ర పోశిస్తారని అనసూయ పవార్ ట్రస్ట్ చైర్మెన్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం భైంసా పట్టణంలోని ఎల్వీ కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులందరికీ అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిన సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఎల్లవేళలా తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూనే, ఫెయిల్ అయిన విద్యార్థులను సైతం ప్రోత్సహించాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. నియోజకవర్గం విద్యాపరంగా ముందుండాలన్న ఉద్దేశంతోనే సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ట్రస్టు ద్వారా ప్రయివేటు ఉపాధ్యాయులందరికీ బీమా కల్పించే ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం పారామిత్ర గ్రూప్ ఆఫ్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ రావు, సైకాలజిస్ట్ అండ్ కెరియర్ కౌన్సిలర్ సంద్ర సుధీర్ ఉపాధ్యాయులకు బోధించే, అంశాలపై మెలకువలను వివరించారు. విద్యార్థులు సక్సెస్ అయ్యే మార్గాలను వారు తెలియజేశారు. ఈ సందర్భంగా రామారావు పటేల్‌ను ఉపాధ్యాయులంతా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాలల డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాష్ పటేల్, పుండలికి రావు, సురేందర్ పాల్గొన్నారు.

మోడీ చిత్రపటానికి బీజేపీ నాయకుల పాలాభిషేకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిజామాబాద్‌కు పసుపు బోర్డును మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్రమోడీకి జిల్లా ఇన్‌చార్జి వెంకట్ పార్లమెంట్ ప్రభారి అల్జాపూర్ శ్రీనివాస్, బద్దం లింగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్‌తో కలిసి మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల అవస్థలు బాధలను పట్టించుకునే ఏకైక ప్రభుత్వం బీజేపీ అన్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్ రైతుల కోరిక మేరకు నిజామాబాద్‌లో పసుపు బోర్డు మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. దీంతో ఎందరో మంది రైతుల కళ నెరవేరిందన్నారు. పత్తి పంట ద్వారా ఆదిలాబాద్, నిజామాబాద్ రైతులు పడుతున్న ఇబ్బందులకు ముగింపు వచ్చేసిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఉన్నారు.

లోకేశ్వరం : మండలంలోని ధర్మోరా గ్రామంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ప్రకటించడాన్ని హర్షిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు మోహన్ రావు పటేల్ మాట్లాడుతూ ప్రతి రైతు ఆనందంగా ఉండడమే ప్రధాని మోడీ లక్ష్యమని, రాబోయే రోజుల్లో మరెన్నో పథకాలు రైతుల కోసం ప్రవేశపెడతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల భాజపా నాయకులు పాల్గొన్నారు.



ప్రధానమంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న పార్లమెంట్ ప్రభారి

బీఆర్ఎస్, బీజేపీలను ఓడించేది కాంగ్రెస్సే

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మబొజ్జు పటేల్



నవతెలంగాణ-పెంబి

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించేది కాంగ్రెస్సేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని పెంబి, ఇటిక్యాల్, తాటిగుడా, ఇటక్యాల తండా, చింతగూడ, పులగంపంద్రి, మందపల్లి, నాగపూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారెంటీలతో పాటు డిక్లరేషన్లను మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ,బీఆర్ఎస్ ఈ రెండు పార్టీలు కూడా దొంగలేనని ఆరోపించారు. కల్వకుంట్ల కవిత లిక్కర్ స్కామ్‌లో పట్టుబడితే బీజేపీతో సీఎం కేసీఆర్ దోస్తీ చేశారని ఆరోపించారు. గ్రామాల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. సంక్షేమ పథకాలల్లో కమీషన్లు తీసుకుని ఎమ్మెల్యేలు దర్జాగా అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే బీఆర్ఎస్, బీజేపీల అవినీతిని బయటకు తీసి వారికి జైలుకు పంపుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. ఖానాపూర్ నియోజవర్గంలో చేతు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి, తులాల శంకర్, మాజీ సర్పంచ్ తొడసం భీంరావు, భూక్యా భీమ్‌రావు, మహేందర్, అర్జున్, బుక్యా వసంత్, భూక్యా సుభాష్, బుక్య గోవింద్, వెడ్మ శేఖర్, ఇందియ్యా, వసంత్‌రావు, వెడ్మ నర్సింగ్ ఉన్నారు.

ఎట్టకేలకు నెరవేరిన పాత్రికేయుల కల

- జర్నలిస్టు ఇండ్ల స్థలాలకు ఎమ్మెల్యే భూమిపూజ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇండ్ల స్థలాల కల నెరవేరింది. బట్టిసావర్గాం గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేశారు. ముందుగా జర్నలిస్ట్ జేఏసీ సభ్యులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ఎన్నో ఏండ్లుగా ఇంటి స్థలాల కోసం జర్నలిస్టులు చేసిన పోరాటం ఫలించిందన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు నిరంతర ప్రక్రియని, జేఏసీ పోరాటంతో పాత్రికేయుల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా జేఏసీ కన్వీనర్ దేవేందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల కోసం ఇంటి స్థలాల కేటాయింపులు ప్రత్యేక చొరువ చూపిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా పాత్రికేయుల సమస్యలపై ఎమ్మెల్యే మరింత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్ వెంకటేష్, జేఏసీ సభ్యులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కెమెరామెన్స్, ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.



నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా యువత కష్టపడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా యువత కష్టపడితే విజయతీరాలకు చేరవచ్చని మున్సిపల్ చైర్మెన్ జోగుప్రేమేందర్ అన్నారు. అగ్నిపథ్‌లో దేశ జవాన్లుగా ఉద్యోగాలు సాధించిన కొంద్ర అనిల్, శివ శంకర్‌రెడ్డి, ఏ.ఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికైన ఓరుగంటి పృథ్వీ రాజ్‌లను ఆయన ఆదివారం ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ యువ నాయకులు జోగు మహేందర్ సైతం వారికి అభినందనలు తెలియచేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 13 పతకాలు సాధించి, ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న క్రీడాకారులు, దేశ రక్షణలో సేవలందించేందుకు అగ్నిపథ్‌లో ఉద్యోగాలు సాధించిన యువకులకు అభినందనలు తెలియచేశారు. విధి నిర్వహణలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి క్రీడల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ, గజు, రాకేశ్, వినోద్, దాస్, స్వామి పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షునికి బీసీ సంఘం పరామర్శ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కొంత కాలంగా అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది జిల్లా కేంద్రానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌ను బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్నర్ రమేష్ ఆధ్వర్యంలో కలిసి నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల జక్కయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం బాలేష్, రైతు అధ్యక్షులు మారుతీ పటేల్, మాలీ సంఘం జిల్లా అధ్యక్షులు నాగోషే శంకర్ పటేల్, బీసీ యువజన సంఘం ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షులు బొట్టుపల్లి ప్రశాంత్, రావుల మధు, నాయకులు గడ్డల శంకర్, బల్హారపు మధుకర్, సిరికొండ సాయికృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-రెబ్బెన

మరమ్మత్తుల కారణంగా నంబాల సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ రాజన్న పేర్కొన్నారు. 33/11 కేవీ ఫిడర్‌లో పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కన్నెపల్లి, బెల్లంపల్లి మండలములో శివాలయం, రేచిని, భీమిని, కన్నెపల్లి మండలాలు పరిధిలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఈనెల 10న జిల్లా ఆస్పత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నవతెలంగాణ- పెద్దపల్లి

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో ఖాళీగా ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు(9), సివిల్ అసిస్టెంట్ సర్జన్ (ఎంబి.బి.ఎస్.) పోస్ట్ (1) ఉన్నాయని, కాంట్రాక్టు పద్ధతిలో పని చేయడానికి ఆసక్తి గల వైద్యులకు ఈనెల 10న ఉదయం 11 గంటలకు పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు డీసీహెచ్ఎస్ డాక్టర్ రమాకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వైద్యులు వారి బయోడేటాతో పాటు అన్ని ఒరిజినల్, ఒక సెట్ జిరాక్సు సర్టిఫికేట్‌లతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ 957314 1615ను స్పందించాలని తెలిపారు.

ఎస్జిటీ టీచర్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ- పెద్దపల్లి

బీసీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ యాప్ ద్వారా డీఎస్సీ, ఎస్జీటీ టీచర్ అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జే. గంగారెడ్డి ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని డీఎస్సీ టీచర్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీకి చెందిన 100 మంది అభ్యర్థులకు అవకాశం ఉంటుందని తెలిపారు. బీసీలకు 75, ఎస్సీలకు 15, ఎస్టీలకు 5, ఈబీసీలకు 5 శాతం అవకాశం ఉంటుందని, ఉచిత శిక్షణ కోసం ఈ నెల 12 లోగా బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ కార్యాలయంలో కుల ధీవీకరణ కులం, ఆదాయం, ఆధార్ కార్డ్, స్టడీ సర్టిఫికెట్స్, డీఎస్సీ దరఖాస్తు పేపర్, నాలుగు పోస్ట్‌సైజ్ పోటోలు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు 0878-2268686 నందు సంప్రదించాలని కోరారు.

ఐదేండ్లలోపు పిల్లలకు టీకా వేయించాలి

నవతెలంగాణ -పెద్దపల్లి

ఐదేండ్ల లోపు పిల్లలకు తప్పిన ప్రతి టీకా వేయించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం మూడో రౌండ్ ఈనెల 9 నుంచి 14వరకు జరుగుతుందని పేర్కొన్నారు. పుట్టిన శిశువు నుంచి ఐదేండ్ల లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తీసుకోకుండా ఉన్నవారికి, అదే విధంగా గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు తీసుకోనట్లయితే వారందరికీ ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ద్వారా టీకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, గ్రామాల్లో టీకాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

ఈ పంచాయతీ టెక్నికల్ ఆపరేటర్లకు కార్యదర్శుల మద్దతు

నవతెలంగాణ- పెద్దపల్లి

తమకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, పే స్కేలు అమలు చేయాలని ఈ - పంచాయతీ ఆపరేటర్లు చేస్తున్న శాంతియుత సమ్మెకు పెద్దపల్లి పంచాయతీ కార్యదర్శిల సంఘం నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. జిల్లా స్థాయిలో పని చేస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్స్‌కి పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళా ఉద్యోగులం దరికీ వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని, ఉద్యోగులందరికి ఆరోగ్య భద్రతను కల్పించాలని కార్యదర్శులు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజరు రజాక్, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, కుమార్, సతీష్, శ్రీనివాస్, గంగాధర్, మిగతా కంప్యూటర్ ఆపరేటర్ లు పాల్గొన్నారు.